## క్లుప్తంగా

### యోగాతోనే ఆరోగ్యం

గద్వాల అర్బన్: ప్రతి రోజు ఉదయం వ్యాయామంతో పాటు యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని మహిళ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు హార్ట్‌ఫుల్ నెస్ మెడిటేషన్ సెంటర్ నిర్వాహకులు యోగా, ప్రాణాయమం చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ మంగళవారం రెండో రోజు కొనసాగింది. రష్యా దేశానికి చెందిన లీల్లీ విద్యార్థినులకు యోగాసనాలు చేయించారు. ట్రైనర్స్ ప్రధాన వక్త రఘు, కరణమ్ ధ్యానం చేయడంతో కలిగే శారీరక, మానసిక అభివృద్ధిపై అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు, ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

### వృత్తి విద్యపై విద్యార్థులకు అవగాహన

కేటీదొడ్డి: పాల వృత్తి విద్యపై అవగాహనతో విద్యార్థులకు వృత్తిపై మక్కువ పెరుగుతుందని ఒకేషనల్ ట్రైనర్ సందీప్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థులకు వృత్తివిద్య కోర్సులో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని పాలకేంద్రం నిర్వాహకుడు మల్లేష్‌గౌడ్‌తో కలిసి పాలకేంద్రంపై అవగాహన కల్పించారు. పాడి రైతుల నుంచి పాలు ఎలా సేకరించి, ఎలా చెక్ చేసుకోవాలో, ఎలా సరఫరా చేయాలనే విషయాలపై విద్యార్థులకు వివరించారు. ఒకేషనల్ ట్రైనర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మిల్క్ సెంటర్‌పై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిపాదనలు పంపండి

అయిజ: అభివృద్ధి పనుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని ముస్లిం మైనార్టీ నాయకులు కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముస్లిం, మైనార్టీలకు సంబంధించిన ఉర్దూ గర్ కమ్ షాదీఖానా, ఈద్గా వద్ద కంపౌండ్ వాల్ నిర్మాణాలకు సంబంధించిన ఎస్టిమేట్ కాపీని కలెక్టర్ కార్యాలయానికి, డీఎండబ్లూఓ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపాలని, నిధులు మంజూరు అయ్యేలా కృషి చేయాలని ముస్లిం మైనార్టీ నాయకులు కోరారు. మహబూబ్ పాషా, మన్నన్, రఫీ, సలీం పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడి దాతృత్వం

కేటీదొడ్డి: తాగునీటి సమస్యతో బాధపడుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈర్లబండ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అమీర్ తన సొంత ఖర్చులతో తాగునీటి అవసరాలు తీర్చేందుకు పాఠశాల సమీపంలో తాగునీటి బోరు వేయించారు. అదే విధంగా కొత్తబోరుకు విద్యుత్ మోటార్ బిగించి దాతృత్వం చాటుకున్నారు. విద్యార్థులకు తాగునీటి ఎద్దడి తీర్చేందుకు ఉపాధ్యాయుడు అమీర్ సుమారు రూ.50 వేలు సొంత ఖర్చులతో పాఠశాల వద్ద బోరు వేయించిన ఉపాధ్యాయుడికి విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

### పీఏసీఎస్ అభివృద్ధికి పాటుపడుదాం...

శాంతినగర్: వడ్డేపల్లి ప్రాథమిక సహకార సంఘం అభివృద్ధికి అందరం పాటుపడదామని ఆ సంఘం అధ్యక్షుడు కోట్ల గోపాల్‌రెడ్డి అన్నారు. వడ్డేపల్లి పీఏసీఎస్ మహాజనసభ(సాధారణ సర్వసభ్య సమావేశం) అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 2022 నుంచి సెప్టెంబర్ 2022 అర్ధ సంవత్సర జమాఖర్చులు, 2023–24 సంవత్సర అంచనా బడ్జెట్, జీఓ ఎంఎస్ నంబర్ 44/17-12-2022 ను సభ్యులు ఆమోదం తెలిపారు. లక్ష్మిరెడ్డి, వెంకట్రామన్‌గౌడ్, జయన్న పాల్గొన్నారు.

### వాహనాలను అనుమతించండి

మానవపాడు: రైతుల వ్యవసాయ కూలీ పనులకు వాహనాల్లో తరలించే కూలీల విషయంలో ఎటువంటి జరిమానా విధించవద్దని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు రైతులు సరైన పంటలు పండగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీల ధరలు పెరిగి పంట దిగుబడి తగ్గి రైతులు ఇబ్బందులు పడుతున్నారని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ చక్రపాణిని కోరారు.

### ఇసుక డంప్‌ల కలకలం

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం, బస్వాపురం శివారులోని పంట పొలాల్లో ఇసుక డంపులు ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందజేసినట్లు సమాచారం. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లా తుంగభద్ర నది తీరం నుంచి పంచలింగాల, తాండ్రపాడు వారు డంప్ చేస్తున్నారా, లేక తెలంగాణ వారే ఇసుకను డంప్ చేస్తున్నారా అనే సమాచారం తెలుసుకుని ఆరా తీస్తున్నట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలియజేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి మైనింగ్ అధికారులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందజేస్తామని పేర్కొన్నారు.

### మినుముల పంపిణీ

అయిజ: మండలంలోని యాపదిన్నెలో మంగళవారం ఏఈఓ అరవింద్ రైతులకు ఉచితంగా మినుముల ప్యాకెట్లను పంపిణీ చేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురం రైతు వేదికలో మంగళవారం రైతులకు సబ్సిడీ ద్వారా మినుము విత్తనాలు పంపిణీ చేశారు.

# ఆత్మీయ సమ్మేళనంలో రసాభాస

- ఎమ్మెల్యేను తప్పుబట్టిన సొంత పార్టీ నాయకులు
- సంక్షేమంలో దేశంలోనే ఆదర్శం: ఎమ్మెల్యే వీ.ఎం అబ్రహం
- బీఆర్ఎస్ పెద్ద కుటుంబం : జెడ్పీచైర్‌పర్సన్ సరిత
- అందరి సహకారంతోనే అభివృద్ధి : ఢిల్లీ అధికార ప్రతినిధి మంద జగన్నాథం



ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మానవపాడు: అందరూ కలిసికట్టుగా ముందుకు తీసుకెళ్లాల్సిన సమ్మేళన సమావేశం గందరగోళంగా ముగించారు. మండలంలోని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సమావేశాన్ని ఎమ్మెల్యే వీ.ఎం అబ్రహం అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఢిల్లీ అధికార ప్రతినిధి మందజగన్నాథం హాజరయ్యారు.

**రాబోయే ఎన్నికలకు సిద్ధం కావాలి..**

అలంపూర్ నియోజకవర్గంలో కార్యకర్తలంతా రాబోయే ఎన్నికలకు సిద్ధం కావాలని ఎమ్మెల్యే వీ.ఎం అబ్రహం పిలుపునిచ్చారు. దేశంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు ఎక్కడా లేవన్నారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 24 గంటల ఉచిత విద్యుత్, దళితబంధు అనేక సంక్షేమ ఆర్థిక పథకాలు అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా సాగునీరు అందిస్తామన్నారు. మల్లమకుంట, వల్లూరు రిజర్వాయర్ ద్వారా నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అలంపూర్ చౌరస్తాలో 100 పడకల ఆస్పత్రి, డిగ్రీ కాలేజీ నిర్మాణానికి కృషి చేశామన్నారు. క్యాతూరు లిఫ్ట్ ఇరిగేషన్ అలంపూర్ నియోజకవర్గంలో దాదాపు రూ.700 కోట్లకు పైగా అభివృద్ధి చేశానన్నారు.

**పెద్ద కుటుంబం..**

బీఆర్ఎస్ పార్టీ పెద్ద కుటుంబమని, సమన్వయంతో ముందుకెళ్లాలని అన్నారు. పెద్ద పార్టీలో భేదాభిప్రాయాలు ఉంటాయని, ఓ కుటుంబంలా వాటిని సరిచేసుకుంటామన్నారు. పార్టీలో విభేదాలు ఉంటే మనమందరం కూర్చొని మాట్లాడుకుందమన్నారు. మా దళపతి కేసీఆర్, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ వెళ్తూ.. పార్టీ అభివృద్ధికి, గెలుపునకు కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఇబ్బందులు ఉంటే, ప్రభుత్వం నుంచి వచ్చే ప్రభుత్వ పథకాలు అందకుంతే చర్చించి ప్రతిఒక్కరికి న్యాయం చేసేలా చూస్తామన్నారు. కేసీఆర్ ఆశీర్వాదంతో పార్టీని ముందుకు తీసుకెళ్దామన్నారు.

**తుమ్మిళ్ల తెచ్చింది నేనే..**

తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్, జోగుళాంబ గద్వాల హాల్ట్, జూరాల లింక్ కెనాల్ అలంపూర్‌లోని అభివృద్ధి పనులు తెచ్చింది నేనే అని ఢిల్లీ అధికార ప్రతినిధి మంద జగన్నాథం అన్నారు. నియోజవర్గానికి పెద్ద అయినంత మాత్రనా.. మా గ్రామానికి వస్తే కూడా ఎమ్మెల్యే అబ్రహం సమాచారం ఇవ్వరన్నారు. ఇలా ఉంటే కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటాయన్నారు.

**శత్రువుకే మొదటి ప్రాధాన్యత..**

అలంపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభివృద్ధికి కృషి చేశామని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పల్లెపాడు శంకర్‌రెడ్డి అన్నారు. నీవు ఏం చేశావో చెప్పు.. ఎన్నికల మేనిఫెస్టోలో ఎం పొందుపర్చాం.. ప్రజలకు ఏమి పనులు చేస్తున్నామో చెప్పాలని..? కేసీఆర్ చేసిన పనులు, ప్రభుత్వం చేసిన పనులు ప్రజలకు అందుతాయని ఎమ్మెల్యే అబ్రహంను విమర్శించారు. గ్రామాల్లో కార్యకర్తల ఇంటికి వెళ్లామంటే.. పార్టీకి వ్యతిరేకం చేసిన శత్రువు ఇంటికి వెళ్లి పనులు చేస్తున్నాడు. నిజమైన కార్యకర్తల పరిస్థితి ఏంటని ఎమ్మెల్యేని ప్రశ్నించారు. దీంతో సమావేశంలో గందరగోళం చోటుచేసుకుంది. చివరకు పోలీసులు వారిని నిలువరించారు.



బీఆర్ఎస్ నాయకుడు పల్లెపాడు శంకర్‌రెడ్డిని నిలువరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# అభివృద్ధి పనులకు భూమిపూజ



గద్వాలలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు: మండల పరిధిలోని తప్పెట్లమొర్సులో మంగళవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. తప్పెట్లమొర్సులో రూ.55 లక్షలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం, బీసీ, ఎస్సీ, మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డు నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి భూమి పూజ చేశారు. సర్పంచ్ కృష్ణయ్యగౌడ్, ఎంపీటీసీ పారిజాత, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపీపీ విజయ్‌కుమార్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బల్గెర హనుమంతు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**చెక్కుల పంపిణీ..**

గద్వాల రూరల్: పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, గ్రంథాలయ చైర్మన్ రామన్‌గౌడ్, మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, కౌన్సిలర్లు మురళి, నాగరాజు, పార్టీ నాయకులు గోవిందు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలతోనే ఆర్థిక సంక్షోభం

ఎర్రవల్లిచౌరస్తా: కేంద్ర ప్రభుత్వ విధానాలతోనే ఆర్థిక సంక్షోభం ఏర్పడి దేశం అప్పుల ఊబిలోకి నెట్టివేయబడిందని సీపీఎం రాష్ట్ర నాయకుడు టి.సాగర్ విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన జనచైతన్య బస్సు యాత్ర మంగళవారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లిచౌరస్తాకు చేరుకోగా.. కూడలిలో బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించి, దేశాన్ని ఆర్థిక మాంద్యంలోకి నెట్టిందన్నారు. బ్యాంకు వడ్డీ రేట్లు పెంచడంతో సంక్షోభాన్ని నివారించలేమని, కేవలం ప్రజలకు ఉపాధిని కల్పించడంతోనే దీనిని నివారించవచ్చన్నారు. ప్రశ్నించే వ్యక్తులను చెరసాల పాలు చేసి ప్రజాస్వామ్య గొప్పతనాన్ని దిగజారుస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు రమణ, రమ, విజయ్‌కుమార్, వెంకటస్వామి, నర్సింహ, రాజేష్ తదితరులు ఉన్నారు.



ఎర్రవల్లి కూడలిలో మాట్లాడుతున్న టి. సాగర్

**బీజేపీని గద్దె దింపే వరకు పోరాటం**

గద్వాల అర్బన్: అధికారంలో ఉన్న బీజేపీని గద్దె దింపే వరకు పోరాటం ఆగదని సీపీఎం రాష్ట్ర నాయకులు సాగర్ అన్నారు. జన చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని చింతలపేట నుంచి బైక్ ర్యాలీని ప్రారంభించి రంగాపురం వరకు కొనసాగించారు. రమణ, ఆరంజ్యోతి, విజయ్, వెంకటస్వామి, నర్సింహ ఉన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



అలంపూర్‌లో రోడ్ల విస్తరణ పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

అలంపూర్: మున్సిపాలిటీలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అన్నారు. పట్టణంలోని దక్షిణ కాశీ అతిథి భవన్‌లో మున్సిపల్ బడ్జెట్, కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ హాజరై మున్సిపాలిటీలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా వేగవంతంగా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం బడ్జెట్ సమావేశంలో పాల్గొన్నారు. మున్సిపాలిటీలో 2022 ఏప్రిల్ 1 నాటికి రూ.147.99 లక్షలు, సాధారణ ఆదాయం మొత్తం రూ.189.84 లక్షలు ఉన్నట్లు పేర్కొన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలు, 2022–23 ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంతో కౌన్సిల్ సభ్యులు ఆమోదించినట్లు తెలిపారు.

**సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానాలు..**

బడ్జెట్ సమావేశం అనంతరం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పనులకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. 1వ వార్డులో రూ.36 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి కౌన్సిల్ సభ్యులు తీర్మానించారు. వీటితోపాటు మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో 2022–23 సంవత్సరంలో పని చేసిన స్కావెంజర్ల జీతాలు ఇవ్వడానికి అనుమతిచ్చినట్లు పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ అతిథి గృహం వద్ద మధ్యలో నిలిచిన ఎంపీడీఓ కార్యాలయ భవనం గురించి మున్సిపల్ కౌన్సిలర్ సుదర్శన్ గౌడ్ జిల్లా అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, కమిషనర్ నిత్యానంద్, ఏఈ మేఘనాథ్, కుర్మయ్య, నాగలక్ష్మమ్మ, ఖలీదా బేగం పాల్గొన్నారు.

# ‘కంటి వెలుగు’ కేంద్రాల సందర్శన

మల్దకల్: మండలంలోని ఎల్కూరు, మద్దెలబండ గ్రామాల్లోని కంటి వెలుగు కేంద్రాలను మంగళవారం ఎంపీడీఓ కృష్ణయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రోజు 150 మందికి డాక్టర్లు కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. వైద్యసిబ్బంది కంటి పరీక్షల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించి, అవసరమైన వారికి అద్దాలు ఇవ్వాలని సూచించారు. డాక్టర్లు నవీన్‌కుమార్, స్వరూపరాణి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని తక్కశీల, కంచుపాడు గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలు కంటి పరీక్షలు చేయించుకున్నారు. మంగళవారం కంచుపాడులో కంటి వెలుగు కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ దేవన్న పరిశీలించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంచుపాడులో 144 మందికి, తక్కశీలలో 162 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

**నేటి నుంచి కంటివెలుగు**

అయిజ: మండలంలోని చిన్నతాండ్రపాడులో బుధవారం రెండో విడుత కంటివెలుగు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విష్ణు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గ్రామంలోని 18 సంవత్సరాలు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా ఇస్తారని, అవసరమైతే కంటి ఆపరేషన్ ఉచితంగా చేయిస్తారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు తెలియజేయాలని సూచించారు.



కంచుపాడులో కంటి వెలుగులో పాల్గొన్న వైస్ ఎంపీపీ దేవన్న

గట్టు: మండల పరిధిలోని గొర్లఖాన్‌దొడ్డి, చాగదోన గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. వైద్య బృందం ఆయా గ్రామాల ప్రజలకు వైద్య శిబిరంలో కంటి పరీక్షలను నిర్వహిస్తున్నారు. రెండు గ్రామాల్లో మొత్తం 274 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. 32 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేశారు. 36 మందికి అద్దాల కోసం ఆర్డర్ పెట్టినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, నరేష్, సూపర్‌వైజర్ స్వర్ణలత, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: మండల పరిధిలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని బుక్కాపూర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని జెడ్పీ సీఈఓ విజయనాయక్ సందర్శించి, పరిశీలించారు. వైద్యబృందంతో ఆమె మాట్లాడారు. ప్రతి రోజు 150 మందికి తగ్గరాదని వైద్య బృందానికి సూచనలు, సలహాలు అందజేశారు. వైద్య శిబిరంలో 90 మంది పురుషులు, 62 మంది మహిళలు మొత్తం 152 మంది చూయించుకున్నట్లు మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్ తెలియజేశారు.

# మధ్యాహ్న భోజనం, నర్సరీ పరిశీలన

అలంపూర్ రూరల్: విద్యార్థులకు పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ సీఈఓ విజయనాయక్ కోరారు. మండల పరిధిలోని బుక్కాపూర్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి, వారిలోని నైపుణ్యాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి సూచనలు, సలహాలు అందజేశారు. రిజిష్టర్లను, రికార్డ్స్‌ను తనిఖీ చేశారు. అలాగే నర్సరీ పరిశీలించి మొక్కల పెంపకం సరిగాలేదని, సరిచేసుకోవాలని సూచించారు. జెడ్పీ సీఈఓ వెంట ఎంపీడీఓ నాగశేషాద్రి సూరి, ఏపీఓ రామకృష్ణ, సర్పంచ్ మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

**పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష**

నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు వంద శాతం రావాలని జెడ్పీ సీఈఓ విజయనాయక్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీలో 50 మంది కూలీలకు తగ్గరాదని, కూలీలను పెంచేలా అవగాహన కల్పించాలన్నారు. నర్సరీల్లో మొక్కలు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ నాగశేషాద్రి సూరి, ఏపీఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



బుక్కాపూరంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ విజయనాయక్

### విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం



కేటీదొడ్డి: ప్రధాన విద్యుత్ కనెక్షన్ విద్యుత్ స్తంభాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో మల్లాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ సంఘటన కేటీదొడ్డి మండల పరిధిలోని మల్లాపురం, సిద్ధన్‌పల్లి గ్రామాల సమీపంలో రోడ్డు పక్కన చోటుచేసుకుంది. మల్లాపురం, సిద్ధన్‌పల్లి గ్రామాల మధ్య ఉన్న ప్రధాన విద్యుత్ లైన్ విద్యుత్ స్తంభాన్ని సోమవారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో నాలుగు స్తంభాలు విరిగిపోయాయి. దీంతో విద్యుత్ వైర్లు కూడా తెగిపోయాయి. మల్లాపురం, మల్లాపురంతండా, సిద్దోనిపల్లి గ్రామాలకు కొన్ని గంటలు పాటు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. విద్యుత్ తీగలు నేలమీద పడటంతో రోడ్డు వెంటం వెళ్లేవారు ఆందోళన చెందారు.

### టీడీపీ హయాంలోనే అభివృద్ధి

గద్వాల అర్బన్: టీడీపీ హయాంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంజిపేట రాములు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 14, 15వ వార్డుల్లో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ హయాంలోనే పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రవి యాదవ్, పుల్లయ్య గౌడ్, వెంకటన్న, నాగరాజు తదితరులు ఉన్నారు.

### ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలి

మల్దకల్: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఎంపీడీఓ కృష్ణయ్య సూచించారు. మంగళవారం మండలంలోని అమరవాయి, సద్దలోనిపల్లి, మద్దెలబండ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో కూలీల సంఖ్య మరింత పెంచి జాబుకార్డులు కలిగిన కూలీలకు అవకాశం కల్పించాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో కూలీలు, ఉదయం సాయంత్రం వేళలో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ స్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రుణాలు చెల్లించాలి

మల్దకల్: బ్యాంకుల ద్వారా మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని యూబీఐ మేనేజర్ గంగాధర్, ఏపీఓ సాంబశివుడు సూచించారు. మంగళవారం మల్దకల్ మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా సమాఖ్య లీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇచ్చిన టార్గెట్ కంటే అదనంగా రూ.5 కోట్లు బ్యాంక్ ద్వారా రుణాలు ఇచ్చినట్లు తెలియజేశారు. పాత సంఘాల సభ్యులు ప్రతినెలా క్రమం తప్పకుండా డబ్బులను చెల్లిస్తూ.. సంఘాలను బలోపేతం చేయాలన్నారు. సుజాతమ్మ, రాజమణి, కిష్టమ్మ, వర్షిణి, జయన్న పాల్గొన్నారు.

# నానో యూరియాపై రైతులకు అవగాహన

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురం రైతు వేదికలో మంగళవారం నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏఈఓ భరత్ రైతులకు నానో యూరియాతో కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నానో యూరియాను వాడటంతో పంట దిగుబడి పెరుగుతుందన్నారు. యూరియా బస్తాతో పోలిస్తే నానో యూరియా వాడకంతో మొక్కలకు ఎక్కువ శాతంలో నత్రజని అందుతుందన్నారు. 500 ఎం.ఎల్ నానో యూరియాలో 40 వేల పీపీఎం నైట్రోజన్ ఉంటుందన్నారు. యూరియా బస్తా కంటే కూడా తక్కువ ధరలో లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాముడు, రైతు సంఘం నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

మల్దకల్: బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అంగన్‌వాడీ సుపర్‌వైజర్ నాగరాణి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మంగళవారం మండలంలోని మద్దెలబండ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణి, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణిలు పోషకాలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు చిరుధాన్యాలతో కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, ప్రధానోపాధ్యాయుడు తిమ్మప్ప, అంగన్‌వాడీ టీచర్లు రాధ, మంజుల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**గర్భిణీలకు అవగాహన**


అలంపూర్ రూరల్: పోషణపక్షంలో భాగంగా అలంపూర్ పట్టణంలోని అంగన్‌వాడీ రెండో కేంద్రంలో గింజ ధాన్యాలపై బాలింతలు, గర్భిణిలకు అంగన్‌వాడీ టీచర్లు మంగళవారం అవగాహన కల్పించారు. గింజ ధాన్యాలు పెసల్లు, అలచందలు, మినుములు, రాగులు, కొర్రలు, జొన్నలు, సద్దలు తీసుకోవడంతో శరీరంలో కాల్షియం, ఐరన్ సమపాలల్లో శరీరంలోకి అందుతాయని తెలియజేశారు. ఏమెలమ్మ, సావిత్రి, శాంతమ్మ, నర్మద, మాధవి, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.



మద్దెలబండలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి

గట్టు: మండల పరిధిలోని ఆలూరులో జాతీయ పోషకాహార దినోత్సవంలో భాగంగా మంగళవారం చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు.

### కరపత్రాల విడుదల



గట్టు: మండల పరిధిలోని మాచర్లలో మంగళవారం మహిళలు తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పోరాడుదాం భూమి కోసం, భుక్తి కోసం అనే కరపత్రాలను విడుదల చేశారు. జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు, శృతి, మహిళలు పాల్గొన్నారు.

### సంత్ సేవాలాల్ ఇరుముడి

కేటీదొడ్డి: మండల పరిధిలోని ఉమిత్యాల, ఉమిత్యాలతండా, గువ్వలదిన్నె, తూర్పుతండా సంత్ సేవాలాల్ మహరాజ్ జగదాంబ దేవి మాల స్వాముల 41 రోజుల దీక్ష అనంతరం మంగళవారం మహారాష్ట్రలోని పొరదేవి ఆలయానికి స్వాములు బయలుదేరారు. స్వాములు స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి కట్టుకున్నారు. .

### రేపు సీతా రాముల కల్యాణం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో 30న సీతారాముల కల్యాణం ఉంటుందని, వేద మంత్రాలతో, ముత్యాల తలంబ్రాలతో కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి తెలియజేశారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో కల్యాణంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

### పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

శాంతినగర్: ప్రభుత్వం ద్వారా మంజూరైన వివిధ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంపీడీఓలు రాఘవ, గోవిందరావ్‌లు అన్నారు. వడ్డేపల్లి పురపాలికలోని శాంతినగర్ మహిళా సమాఖ్య భవనంలో ఎంపీడీఓ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

### విద్యార్థులకు బహుమతులు

మానవపాడు: అమెరికాలోని ఫిలడెల్ఫియా స్వచ్ఛంద సంస్థ వారు మండలంలోని జల్లాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యావారధి అనే ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమం నిర్వహిస్తున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవి తెలిపారు. నిర్వాహకురాలు శ్రీపాద శిక్షణ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. అమరేందర్‌రెడ్డి, లక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.